




**-2-**

# సర్వస్వతంత్ర భక్త కవి రాజు -ధూర్జటి

"రాజుల్మత్తులు; వారి సేవ నరకప్రాయంబు, వారిచ్చు సం
భోజాక్షీ చతురంతయాన తురగీ భూషాదు లాత్మవ్యధా
బీజంబుల్, తడపేక్ష చాలు......" అని నిర్భయంగా నిజాలను చాటి చెప్పిన మొదటి కవిగా సాహిత్యములో మనకు ధూర్జటి దర్శనమిస్తాడు.

దూర్జటి కాలనిర్ణయము చరిత్రకారులకు పెద్ద కష్టమైన విషయము కాలేదు. ఆయన కృష్ణదేవరాయలు వారి ఆస్థానములో వున్నాడని చెప్పేందుకు మనకు నిదర్శనాలు వున్నాయి.

ఆయన వంశములోని నాలుగవ తరము వాడైన కుమార ధూర్జటి తన రాయవాచకములో ఆ విషయము పేర్కొన్నాడు కూడా.

తెలుగునాట ప్రచారము పొందిన,రాయలు వారన్నట్లుగా నమోదైన పద్యము "స్తుతిమతియైన ఆంధ్రకవి దూర్జటి పల్కులకేల వచ్చెనో అతులిత మాధురీ మహిమ" (స్తుతింప తగిన మతి కలిగిన తెలుగు కవి ధూర్జటి పలుకుకలకు ఈ సాటి లేని మాధుర్యము ఎలా కలిగింది? అని రాయలు వారి సందేహమట)

అని ప్రశ్నించాడని,

దానికి తెనాలి రామకృష్ణయ్య " హా! తెలిసెన్ భువనైక మోహనోద్దత సుకుమార వార వనితా జనతా ఘనతాప హారి సంతత మధురాధరోదిత సుధారస ధారణ గ్రోలుటం జమీ్మ" సమాధానమిచ్చినాడట.

(భువనైక మోహనముగా వున్న వార కాంతల మధుర అధరముల నుంచి వచ్చిన అమృతము త్రాగుట వలనట). ఇది మనకు దూర్జటి రాయలు కొలువులోని వాడే నని చెబుతున్నది.

రాయలు వైష్ణవము పాటించాడు. వ్యాసరాయలును తన గురువులను పూజించాడు. పరమత సహనము కలవాడిగా పేరు తెచ్చుకున్నాడు.

ధూర్జటి కవిత్వాన్ని శివునకు అంకితమిచ్చినా రాయలు ఏమీ అన్నట్లుగా మనకు కనపడదు. మరి అయినా కూడా ధూర్జటి "రాజుల్మత్తులు......" అని ఎలా చెప్పాడు?

రాయలు వంటి వారి అనంతమైన గంభీర మధుర ఆతిధ్యము స్వీకరించిన తరువాత కూడా ఎలా చెప్పగలిగాడు.

బహుశా యవ్వనములో రాయలునాశ్రయించి, రాయలు మరణించిన తరువాత సొంతవూరుకు వచ్చి ఇలా చెప్పి వుండవచ్చని ఆరుద్ర తన "సమగ్ర ఆంధ్ర సాహిత్యము"లో అంటాడు.

బహుశా ఆయన రాయలు తదనంతరము హంపిలో వుండలేక తన సొంతవూరైన కాళహస్తి వచ్చి, తన రచనను సాగించి వుండవచ్చు.

కొందరు శిష్టాచారులు దూర్జటికి వేశ్యాలోలత్వము అంటకట్టారా అని ఆగ్రహించారు. కాని దూర్జటి రాసిన శతకములో ఇతని వేశ్యాలోలతను సూచించే పద్యాలు వున్నాయి.

"కాయల్గాచె వధూనఖాగ్రములచే, గాయంబు, వక్షజముల్
రాయన్రాపడె ఱొమ్ము, మన్మథ విహారక్లేశ విభ్రాంతిచే
ప్రాయంబాయెను, బట్టగట్టెతల, చెప్పెన్ రోత సంసారమే
జేయంజాల విరక్తు చేయగదవే శ్రీకాళహస్తీశ్వరా!" వంటివి ఉదాహరణగా కనపడుతాయి.

" సు+కుమార+వార = సమూహం = సుకుమార వార సమూహమని

సంసారమంటే మధువు వంటిదని వనితా జనతా అంటే భార్య సంసారముట, రోధిత మంటే రా+ఉదితము, రమ్ అన్న బీజాక్షర ఉపాసన బలమన్న సుధలను త్రాగటము వలన కలిగినదని

అంటే ఈ సంసారము నంటక ఉపాసన ద్వారా కవిత్వమునకు "అతులిత మాధురీ మహిమ " కలిగినదని రామకృషిణుడన్నాడని కీ.శే. రావూరి వేంకటేశ్వర్లు గారి ఉవాచ. రామకృష్ణ కవిత్వమునకు అంతటి గుంభనల కలదు.

దూర్జటి శివ భక్తుడు. ఆయన కాళహస్తి లోని కాళహస్తీశ్వరుణ్ణి భక్తి వైరాగ్యాలతో కొలుచుకున్నాడు. తను రాసిన శతకమునూ, కావ్యమునూ ఆ స్వామికే అంకితమిచ్చిన భక్త కవాయన.

"నీకుంగాని కవిత్వమెవ్వరికి నే నీవంచు మీదెత్తితిన్
చేకొంటిన్ బిరుదంబు కంకణము ముంజేతి కట్టితిం బట్టితిన్"
అని తన కవిత్వము కేవలము శివుని మాత్రమే అంకితమిచ్చాడు.
దూర్జటి కవిత్వాన్ని దివ్య కళగా భావించాడు. ఈశ్వరుని లీలను పొగడ వాడాడాయన.

తెలుగు సాహిత్యములో బహుళ ప్రచారము పొందిన ప్రక్రియ శతకము. శతకములలో దూర్జటి "శ్రీకాళహస్తీశ్వర శతకము" మణిమాణిక్యము వంటిది. వంద పద్యాలు వుండటము, మకుటములో సాగటమూ, ముక్తకాలు కావటము, వేటికదే స్వతంత్రముగా వుండటము శతక లక్షణాలు.

కవితా పరంగా, ఆర్తి పరంగా భక్తి శతకాలలో శ్రీకాళహస్తీశ్వర శతకము అగ్రగణ్యము.

సామాజిక అన్యాయాలను దేవుని వద్ద మొరపెట్టుకోవటము నిజముగా చాలా విచారకరము. ఆ ఆర్తి ఈ శతకములో నిండుగా కనిపిస్తుంది.

ఒక సాలె పురుగు (శ్రీ) , ఒక పాము (కాళము), ఒక ఏనుగు (హస్తి) శివుణ్ణి సేవించి ముక్తి పొందిన కథలు ఈయన కవితావస్తువు.

" ఏ వేదంబు పఠించెలూత, భుజంగంబే శాస్త్రముల్చూచె, దా
నే విద్యాభ్యాసనం బొనర్చె గరి, చెంచేమంత్ర మూహించె, బో
ధావిర్భావనిదానముల్ చదువులయ్యా? కావు! మీ పాదసం
సేవాసక్తియో కాక జంతుతతికిన్ శ్రీ కాళహస్తీశ్వరా!"

ఓ శ్రీకాళహస్తీశ్వరా! నెమ్మదిగా ఆలోచించగా జ్ఞానము యొక్క పుట్టుక కేవలము నీమీద వున్న భక్తి వలన తప్ప చదువుల వలన కాదు. ఏం చదివినవి సాలెపురుగు, పాము ఏనుగ? ఏం శాస్త్రములు చదివినాయి? ఏ వేదాలు పఠించినాయి? ఏం మంత్రము జపం చేశాయి?చెంచు అయిన తిన్నడికి ఏం తెలుసు? కేవలము భక్తితో శివుడిని సేవించి ముక్తి పొందారు.

శ్రీ కాళహస్తిలో ఈ మూడు జీవాలకు ముక్తి నొసగాడు శివుడు కాబట్టి వాటి పేర ఆ స్వామిని శ్రీ కాళహస్తీశ్వరుడని పిలుస్తారు.

శివున్ని తప్ప మరు దైవము తలవని వీర భక్తుడు దూర్జటి.

"నీ పేరున్ భవదంఘ్రి తీర్థము భవన్నిష్ఠ్యూత తాంబూలముల్
నీ పళ్ళము ప్రసాదము కొని కదా నే బిడ్డనైనాడ న
న్నీ పాటి గరుణింపమోప నిక నే నెవ్వారికిన్ బిడ్డ గాన్
చేపట్టందగు పట్టి మానందగదో శ్రీకాళహస్తీశ్వరా!"

నీ నామము స్మరిస్తూ, నీ పాదతీర్థము స్వీకరించి, నీవు తిన్న పళ్ళెములో మిగిలిన పదార్థములను తిని, నీ ఎంగిలి తాంబూలము తిని నే నీపిల్లవాడినైనాను. ఇక నన్ను విడిచిపెట్టతగదు.

ఇందులో ఆయన తన భక్తితో స్వామితో సంభాషణగా ప్రకటించటమూ, గట్టి పట్టుదలతో పాటూ, నన్ను నీవు రక్షించాలి, నాకు మోక్షం ఇవ్వవలసినది నీవే సుమా అన్న హెచ్చరిక వుంది. అంతటి బలమైన వాదన కేవలము తీవ్ర భక్తితో నే సాధ్యము.

నిందాభక్తి కి కూడా దూర్జటి శతకములోని ఉదాహరణలు మనకు కనపడుతాయి.

"పరమానాశన భూషణ ప్రకరము ల్బాద్రేభచర్మంబు, నా
టక కవిత్వంబు ప్రియంబులై భుజగశుండాలాటవీచారులన్
భవదుఖంబులబాపు టొప్పుగొలదింబాటించి కైవల్యమి
చ్చి వినోదించుట కేమి కారణమయా శ్రీ కాళహస్తీశ్వరా!"

ఆభరణములుగా పాములు ధరించినందుకు నీవు నాగులకు ముక్తి నిచ్చావు. సరే! ఏనుగ చర్మము ధరించావు, కాబట్టి ఏనుగ ముక్తి పొందింది.  పశుపతివి, అంటే మృగాలు అడవిలో వుంటవి. అటవికులు నీకు చుట్టాలు. బావున్నది. అందుకని చెంచుకు మోక్షమిత్చావు. సాలెపురుగునకెందుకు మోక్షమిచ్చావు. భవ రోగము కుదర్చమంటే మొక్షమిస్తావా? కారణమేముటయ్యా? అంటున్నాడు.

తనని కొలిస్తే ఇక మళ్ళీ జన్మలేని స్థితినిస్తాడని చెప్పక చెబుతున్నాడు.

ముక్తి శివపూజ చెయ్యనంతవరకేనట. ఒకసారి శివపూజ చేసిన తరువాత ఇక వాడికదే కడగొట్టు జన్మ. ఇందులో శివుణ్ని ఆక్షేపిస్తున్నట్లుగా వున్నా, స్వామి అపార కరుణనను చెప్పక చెప్పాడు దూర్జటి. ఇది మాధురీ మహిమ, దూర్జటి కవిత్వపు లక్షణము.

దూర్జటి శతకమును బట్టి దూర్జటి కాలము నాటి సమకాలీన స్థితిగతులను వూహించవచ్చును.

ఇది ఒక రకముగా దూర్జటి ఆత్మకథ.

దూర్జటిలోని భావాలు అత్యాధునికాలు. ఆ కాలములో వుండటము చాలా ఆశ్చర్యకరములు.

" కొడుకులు పుట్టరటంచునేడ్తురవివేకుల్ జీవన భ్రాంతులై
కొడుకుల్ పుట్టరె కౌరవేంద్రునకనేకుల్ వారిచే నే గతుల్
వడసెన్ పుత్రులు లేని యా శుకునకు పాటిల్లెనే దుర్గతల్ "
అంటూ ప్రశ్నించటము నిజముగా విచిత్రము.

కొడుకులు లేరని దుఃఖించము అజ్ఞానము. కౌరవులు వందమంది, కాని కౌరవరాజుకు ఏం గతి పట్టినది. మరి శుకయోగికి కొడుకులే లేరు. ఆయనకు నరకమొచ్చిందా? అంటూ ప్రశ్నించాడు దూర్జటి.

ఇటు వంటి ఆధునిక భావాలని మరో కవి పంచటము మనము చూడము.

రాజుల దుర్మార్గముతో విసిగిపోయాడాయన. దాదాపు 21 పద్యాలలో రాజుల ప్రస్థావన వచ్చింది.

"రాజై దుష్కృతి జెందె చందరుడు "

"రాజకీటకముల నే సేవింపకనోప"

"దుర్మాగుల్ ఛీ ధాత్రీశుల చెయ్యనేటికీ" వంటివి మనకు కనపడుతాయి.

గట్టిగా విమర్శించి  తన స్వాతంత్రమును చూపెట్టినాడు.

మంచి హృదయమున్న రాజును చూపితే సేవిస్తానని సవాలు కూడా చేస్తాడాయన.

అంటే ఆనాడు అంతా అంత కౄరరాజులనే మనము అనుకోవాలి. అది బహుశా కృష్ణరాయలు తరువాతి కాలమై వుండవచ్చు.

ఆయన తన కవిత్వములో ఎన్నో వ్యావహారిక పదజాలాలను వాడినాడు.

"రోసీ రోయదు, కోసి కోయదు" వంటి మాటలు మనకు కుప్పలుగా కనపడుతాయి.

ఆర్తితో కూడిన భక్తితో శివుడను వెంటనే కొలవమని మనకు సలహా కూడా ఇస్తాడు దూర్జటి.

"దంతంబుల్పడనప్పుడే తనవునం దారూఢి యున్నప్పుడే
కాంతా సంఘము రోయనప్పుడే జరాక్రాంతంబుగాననప్పుడే
వింతల్మేన చరించనప్పుడే కురుల్వెల్ల గానప్పుడే
చింతింపన్వలె నీ పదాంభుజముల్ శ్రీ కాళహస్తీశ్వరా!"

మానవుడు దంతములు ఊడనప్పుడే, శరీర పటుత్వము తగ్గనప్పుడే, స్త్రీలు అసహ్యపడకమునుపే, శరీర పటుత్వము తగ్గకమునుపే, శరీరము రోగములతో తూట్లు పడకమునుపే, జుట్టు తెల్లపడి వూడిపోక మునుపే, శివుణ్ని స్మరించి మోక్షము పొందవలెమని చెబుతాడు.

ఆయన శతకముతో పాటూ "శ్రీ కాళహస్తీశ్వమహత్యము" అన్న ప్రభందము రచించాడు.

755 గద్యపద్యాలున్న ఆ కావ్యము కూడా శ్రీకాళహస్తీశ్వరునికే అంకితమిచ్చాడు. వివిధ రసాలతో కూడిన పరిపూర్ణమైన ఆ కావ్యములో దూర్జటి పది మంది భక్తులను పరమశివుడు కరుణించే కథలు వివరించాడు.  అందులో తిన్నడన్న చెంచె కథ, నత్కీరుని కథ చాలా ప్రచారము పొందాయి.

కాళహస్తీశ్వరుడి పేరు చెబితే చాలు దూర్జటి పులకరించిపోతాడు. పరవశముతో గానము చేస్తాడు.  ఆయనలోని శివ భక్తి అనన్యము. ప్రతి పద్యము గుండెలలోంచి వెలుబడినది. చిక్కటి పదబంధము, అలంకారము, లక్షణాలతో కవితాధారగా సాగే పద్యాలు చదివేవారిని ఆనందములో మునకలు వేయిస్తాయి.

ఆయన కవిత్యము సహజముగా వుండి బహుముఖ నిర్వహణా శక్తిని చూపుతాయి. సర్వస్వతంత్రముగా వుంటాయి. స్వేచ్చగా చెప్పదలచినది జంకు లేకుండా చెప్పిన అసలైన స్వేచ్ఛా కవికికి చక్కటి తార్కాణము దూర్జటి.

ఋఎఫ్;
శ్రీ కాళహస్తీశ్వర శతకము
సమగ్ర ఆంధ్ర సాహిత్యము – ఆరుద్ర
పద్య కవితా పరిచయము – బేతవోలు రామబ్రహ్మం

COMMENTS